
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



3 **నంద్యాల**

జిల్లా వార్తలు

మంగళవారం 21 మే 2024



సొమ్ములు స్వాహా?

- విజయ డెయిరీలో రూ.3 కోట్ల స్కాం..?
- డబ్బులు కాజేశాడని డీడీపై అనుమానాలు
- లెక్కల్లో తేడాపై ఆరా తీస్తున్న అధికారులు
- విషయాన్ని బయటకు పొక్కనివ్వకుండా జాగ్రత్త పడుతున్న యాజమాన్యం

రాయలసీమ జిల్లాలకే తలమానికంగా విజయ డెయిరీ పేరు గడించింది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ డెయిరీ పూర్తిగా భ్రష్టు పట్టింది. డెయిరీ సొమ్ములను యాజమాన్యం సొంత ఖర్చులకు ఇష్టారీతిగా ఖర్చు పెట్టడమే కాకుండా డెయిరీ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ప్రస్తుతం డెయిరీలో దాదాపు రూ.3 కోట్ల స్కాం జరిగిందన్న విషయం బయటకు పొక్కింది. ఫిల్లింగ్ సెంటర్ల నుంచి వసూలు చేసిన సొమ్ము పక్కదారి పట్టిందన్న ప్రచారం జరుగుతోంది. డెయిరీకి చెందిన డీడీ ఈ డబ్బు కాజేశాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఈ విషయం బయటపడి దాదాపు వారం రోజులు కావస్తున్నా డెయిరీ యాజమాన్యం బయటకు పొక్కనివ్వకుండా జాగ్రత్త పడుతోంది. చిన్న చిన్న విషయాలకే డెయిరీ కార్మికులపై నిబంధనల పేరుతో ఒంటి కాలి మీద లేచే యాజమాన్యం భారీగా డబ్బు పక్కదారి పట్టినా ఎందుకు దాచిపెడుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నంద్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి):

ఫిల్లింగ్ స్టేషన్ల నుంచి..

సాధారణంగా విజయ డెయిరీ రైతుల నుంచి పాలను సేకరిస్తోంది. ఇందుకోసం ఆయా జిల్లాలో ఫిల్లింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసి అక్కడి స్థానిక రైతుల నుంచి పాలను తీసుకుంటోంది. అయితే ఈ ఫిల్లింగ్ స్టేషన్లలో కొంతమేర పాలను పక్కదారి పట్టించి అదే స్థాయిలో నీళ్లను కలిపి డెయిరీకి పంపిస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయి. డెయిరీ పరిధిలోని దాదాపు 14 స్టేషన్లలో ఇలా జరుగుతోందని సమాచారం. ఇదంతా డీడీ చేయిస్తున్నాడన్న ప్రచారం కూడా ఉంది. ఇలా ఆయా ఫిల్లింగ్ స్టేషన్ల నుంచి నెలకు దాదాపు రూ.60 వేల వరకు డీడీ వసూలు కార్యక్రమం పెట్టినట్లు తెలుస్తోంది. ఇలా దాదాపు రెండేళ్ల కిందటి నుంచి ఈ వ్యవహారం జరుగుతోంది. డీడీ, ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు కలిసి చేసిన ఈ స్కాం చేసిన స్కాం విలువ దాదాపు రూ.3 కోట్ల వరకు ఉంటుందని అంచనా.! ఇలా ఇచ్చే సొమ్ముతో అనంతపురంలోని ఓ ఫిల్లింగ్ సెంటర్ మేనేజర్ డీడీకి బంగారం కొనిపెట్టగా అక్రమార్జనతో డీడీ ఓ చోట ప్లాటు కూడా కొన్నాడని కూడా ప్రచారం జరుగుతోంది. ఇక ఈ భారీ స్కాంలో ఆయా ఫిల్లింగ్ సెంటర్ల మేనేజర్లకు ఎంత వాటా.. డీడీకి ఎంత వాటా? అనేది తెలియాల్సి ఉంది.



ఎవరెవరి వాటా ఏమిటి..?

డెయిరీలో ఏం జరుగుతోందనేది ఎప్పటికప్పుడు డెయిరీ చైర్మన్‌కు, ఎండీకి, మిగతా డైరెక్టర్లకు తెలిసిపోతుంది. అయినా డెయిరీలో ఇప్పటి వరకు జరుగుతున్న అక్రమాలపై ఒక్క కమిటీ వేసింది లేదు. అసలు డెయిరీ సొమ్ము పక్కదారి పట్టలేదని నిరూపించే ప్రయత్నమూ డెయిరీ తరపు నుంచి జరగలేదు. డెయిరీలోని ఉన్న వారంతా ఎవరికి దొరికినంత వారు దోచుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. డెయిరీ సొమ్ముతో చైర్మన్ ఖరీదైన కార్లు కొని విలాసంగా తిరుగుతున్నాడన్న ప్రచారం జరుగుతుంటే.. డెయిరీలోని బొగ్గు పక్కదారి పట్టిందన్న విషయం కూడా బయటకు పొక్కింది. ఇక పాలు, పాల పదార్థాలకు సంబంధించిన కొనుగోళ్లలో కూడా అవకతవకలు జరిగాయని, డైరెక్టర్ల సొంత ఖర్చులకు డెయిరీ సొమ్ము వాడుకుంటున్నారన్న ఆధారాలతో సహా పలువురు ఆరోపించారు. వీటిపై 'ఆంధ్రజ్యోతి' ఎప్పటికప్పుడు కథనాలను కూడా ప్రచురించింది. అయినా డెయిరీ యాజమాన్యం ఇప్పటి వరకు ఏ ఒక్క విషయంపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇవన్నీ చైర్మన్, ఎండీ, డైరెక్టర్లంతా కలిసి చేస్తున్న అక్రమాలేనన్నది పలువురు చేస్తున్న విమర్శ. ఇక ప్రస్తుత స్కాం కూడా అందరికీ తెలిసే జరిగిందన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కళ్లముందు ఇంత పెద్ద స్కాం జరిగిన తర్వాత బాధ్యులపై కనీసం పోలీసు ఫిర్యాదు కూడా చేయకుండా డీడీ జారుకునేందుకు డెయిరీ యాజమాన్యమే అవకాశం ఇచ్చిందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా డెయిరీ యాజమాన్యం సక్రమమైన చర్యలు తీసుకుని డెయిరీ సొమ్మును రాబడితే బాగుంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

అక్రమార్కులకు కల్పతరువులా..

రాష్ట్రంలోని మిగతా డెయిరీలతో పోల్చుకుంటే విజయా డెయిరీ మంచి లాభాల్లో ఉంది. ఈ లాభాన్ని మళ్లీ పాడి రైతులకే వినియోగిస్తే జిల్లాతో పాటు మిగిలిన రాయలసీమ జిల్లా పాడి రైతులకు లాభసాటిగా ఉంటుంది. అసలు డెయిరీ ముఖ్య ఉద్దేశం కూడా అదే. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో డెయిరీ నడుస్తోంది. డెయిరీలో మంచి లాభాల్లో ఉండటంతో అధికార పార్టీ అక్రమార్కుల కన్నుపడింది. డెయిరీకి వచ్చే లాభాల్లో అసలు ఎంత డెయిరీకి చేరుతోంది, ఎంత పక్కదారి పడుతుందోనన్న విషయం బయటకు తెలిసే అవకాశమే లేదు. దీనికి తోడు డెయిరీ ప్రభుత్వ అజమాయిషీలో లేదు కాబట్టి ఇక్కడ ఏం జరిగినా అడిగే నాథుడే ఉండడు. ఇక అడిగే వారిపైన కక్షగట్టి బయటకు పంపే కార్యక్రమాన్ని డెయిరీ యాజమాన్యం చేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో డెయిరీ యాజమాన్యం ఆడింది ఆటగా, పాడింది పాటగా సాగుతోంది.



ఎందుకు దాస్తున్నట్లు..?

డెయిరీ సొమ్ము భారీగా పక్కదారి పట్టిందన్న విషయం డెయిరీ యాజమాన్యం దృష్టికి వచ్చింది. ఈ విషయంపై ఇప్పటికే ఆరా తీస్తున్నారు. అనంతపురానికి చెందిన ఫిల్లింగ్ సెంటర్ మేనేజర్ డీడీకి బంగారం కొనిపెట్టిన విషయం నిజమన్న నిర్ధారణకు కూడా డెయిరీ యాజమాన్యం వచ్చిందని తెలుస్తోంది. ఇక ఇదే విషయంపై నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలోని ఓ ఫిల్లింగ్ సెంటర్ మేనేజర్‌ను తప్పించినట్లు సమాచారం. ఈ విషయం డెయిరీ యాజమాన్యానికి తెలిసిపోవడంతో డీడీ మెల్లిగా జారుకున్నాడన్న ప్రచారం నడుస్తోంది. ఇదే విషయం 'ఆంధ్రజ్యోతి' డెయిరీ ఎండీని వివరణ అడగ్గా అలాంటిది ఏమీ లేదని, డీడీ సెలవుపై వెళ్లారని ఓ వైపు చెబుతూనే, లెక్కల్లో తేడా వస్తే ఆరా తీస్తున్నామని మరోవైపు చెప్పారు. ఇక ఈ విషయంపై డీడీతో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆయన ఫోను అందుబాటులోకి రాలేదు. ఇక్కడే డెయిరీ యాజమాన్యం తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బంగారం కొనిపెట్టిన విషయం నిజమని తేలటం, రుద్రవరంలోని ఓ ఫిల్లింగ్ సెంటర్ మేనేజర్‌ను తప్పించిన తర్వాత డీడీ సెలవుపై వెళ్తానంటే.. డెయిరీ నిర్వాహకులు ఎలా వెళ్లనిచ్చారు? అనేది అర్థంగాని ప్రశ్న. అసలు విషయం బయట పడగానే ఓ కమిటీ వేసి వాస్తవాలు ఏమిటో తేల్చేయకుండా ఇంకా ఆరా తీస్తున్నామని చెప్పడం ఏమిటో డెయిరీ యాజమాన్యానికే తెలియాలి.



ఒక్కొక్కరికి ఒక్కో న్యాయమా..?

డెయిరీలో కింది ఉద్యోగులు, కింది స్థాయి సిబ్బందికి ఓ విధమైన న్యాయం, పై వారు చేస్తే ఓ విధమైన రూల్‌ను డెయిరీ యాజమాన్యం వర్తింపజేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డెయిరీలో పని చేసి రిటైరైన వారికి డబ్బులు లేవన్న సాకుతో ఇప్పటికీ బెనిఫిట్లు అందజేయకపోవడంతో వారంతా లబోదిబోమంటున్నారు. మరోవైపు కొంతమంది కార్మికులు యూనియన్ పెట్టారన్న సాకుతో పనిలో నుంచి తీసివేసింది. ఎప్పటి నుంచో పని చేస్తున్న వారికి తక్కువ జీతాలు ఇస్తూ యాజమాన్యం తరపు వారిని మాత్రం కొత్తగా పనిలోకి అధిక వేతనం ఇచ్చి మరీ తీసుకుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక పాలు సక్రమంగా సేకరించడం లేదనో, పక్కదారి పట్టించారన్న ఆరోపణలతోనో డైరెక్టర్లను, మేనేజర్లను డెయిరీ యాజమాన్యం తీసేసింది. మరి ఈ రూ.3 కోట్ల స్థాయిలో స్కాం జరిగిన విషయంపై డెయిరీ యాజమాన్యం ఎందుకు సరైన చర్యలు తీసుకోవడం లేదన్నది పాడి రైతులతో పాటు, సామాన్యుడి నుంచి వ్యక్తమవుతున్న ప్రశ్న.



అలాంటిది ఏమీ లేదు. ఆరా తీస్తున్నాం

విజయా డెయిరీలో స్కాం లాంటిది ఏమీ జరగలేదు. లెక్కల్లో తేడా వస్తే దానిపైన ఆరా తీస్తున్నాం. డీడీ వెళ్లి పోయాడన్నది కూడా వాస్తవం కాదు. మూడు రోజులు సెలవుపై వెళ్లాడు. మళ్లీ వస్తాడు. ఈ లోపల అసలు ఏం జరిగిందో తేలుస్తాం.

- ప్రదీప్ కుమార్, ఎండీ, విజయా డెయిరీ, నంద్యాల.

మల్లన్న సేవాకర్తలపై అదనపు భారం

- ఆన్‌లైన్‌లో నిలిచిన అభిషేకానంతరం టిక్కెట్లు
- స్పర్శ దర్శనానికి అదనపు వసూళ్లు
- దేవస్థానం వెబ్‌సైట్‌లో అంతరాయమే కారణం
- దర్శనానికి భక్తుల అవస్థలు
- ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ కొత్త నిర్ణయాలు





టిక్కెట్లను స్కాన్ చేయించుకుంటున్న భక్తులు,

శ్రీశైలం, మే 20: శ్రీశైలంలో అభిషేక సేవలు జరిపించుకున్న భక్తులు సోమవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేవస్థానానికి చెందిన వెబ్‌సైట్‌లో ఆదివారం రాత్రి నుంచి అభిషేకానంతరం టిక్కెట్లు నిలిచిపోయాయి. ఇదే అదునుగా భావించి సోమవారం ఉదయం నుంచి భక్తుల వద్ద అదనపు రుసుములను దేవస్థానం అధికారులు వసూళ్లు చేశారు. వెబ్‌సైట్‌లో అభిషేకం టిక్కెట్లు లభించినప్పటికీ వాటికి అనుసంధానంగా జారీ చేసే రూ.500 అభిషేకానంతరం టిక్కెట్లు లభించక భక్తులు తీవ్ర ఆందోళన చెందారు. అభిషేక సేవా కర్తల వెంట వచ్చిన కుటుంబ సభ్యుల్లో ఇద్దరికి చొప్పున అదనపు చెల్లింపులు చెల్లించాల్సి వచ్చింది. అభిషేకానంతర టిక్కెట్లు అందుబాటులో లేని కారణంగా దేవస్థానం అధికారులు ఒక్కో భక్తుడికి రూ.300 టిక్కెట్లను రెండేసి చొప్పున కొనుగోలు చేయించి ఆలయంలోకి అనుమతించారు. ఒక్కో భక్తుడు రెండు టిక్కెట్లను ఎందుకు తీసుకోవాలని క్యూలైన్ల వద్ద ఉన్న అధికారిని భక్తులు నిలదీశారు. అభిషేకానంతరం టిక్కెట్లు అందుబాటులో లేని కారణంగా, దేవస్థానం ఆదాయం కోల్పోకుండా చూడడంతోపాటు భక్తుడికి స్వామివారి స్పర్శ దర్శనం కల్పించేందుకు రెండేసి చొప్పున టిక్కెట్లు తీసుకోవాలని సూచించినట్లు దేవస్థానం పర్యవేక్షకురాలు హిమబిందు తెలిపారు. అయితే గతానికి భిన్నంగా దేవస్థానం అధికారులు కొత్త విధానాలను ప్రవేశపెడుతూ ఇబ్బందులు పెడుతున్నట్లు భక్తులు మండిపడ్డా రు. గత రెండు రోజుల నుంచి దేవ స్థానం అధికారులు, వెబ్‌సైట్ నిర్వాహ కులు వెబ్‌సైట్‌లో మార్పులు చేస్తున్నా రు. మార్పులు జరిగే క్రమంలో వెబ్‌సైట్ నుంచి అభిషేకానంతరం టిక్కెట్లు గల్లం తు కావడం భక్తులతోపాటు దేవస్థానం ఉద్యోగులను కూడా ఖంగు తినిపించింది. దేవస్థానంలోని ఐటీ విభాగం కూడా ఈ పరిణామాన్ని గుర్తించకపోవడం గమనార్హం. వెబ్‌సైట్‌లో నెలకొన్న అంతరాయం వల్ల వందలాది భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. సోమవారం సాయంత్రానికి కూడా సమస్య పరిష్కారం కాకపోవడంతో మరుసటి రోజు మంగళవారం కూడా అదే పరిస్థితి పునరావృతం కానుంది. అయితే దేవస్థానం వెబ్‌సైట్‌లో నెలకొన్న ఈ సమస్యను అధికారులు ఎప్పటిలోగ పరిష్కరిస్తారో కూడా వెల్లడించకపోవడం గమనార్హం. రాష్ట్రంలో తిరుమల తరువాత అతి పెద్ద దేవాలయం శ్రీశైల దేవస్థానంలో భక్తులకు ఎటువంటి ముందస్తు ప్రకటన చేయకుండా వెబ్‌సైట్‌లో మార్పులు చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. ఇంత జరుగుతున్నా దేవస్థానం అధికారులు, వెబ్‌సైట్ నిర్వాహకులు నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేకపోవడం కొసమెరుపు.

రైతులకు శుభవార్త

- ఈసారి మంచి వర్షాలే కురుస్తాయి
- ముందస్తు వానలతో విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్న రైతులు




కర్నూలు(అగ్రికల్చర్), మే 20: రుతుపవనాలు చురుగ్గా విస్తరిస్తున్నాయని, ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు అత్యవసరమైన నైరుతి రుతుపవనాలు రెండు రోజుల కిందట దక్షిణ అండమాన్ ప్రాంతంలో నికోబార్ దీవుల్లోకి ప్రవేశించాయని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. దీని వల్ల ఈసారి వర్షాలు బాగా కురుస్తాయని తెలిపారు. మే 31న నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నాయని, జూన్ మొదటి వారంలో రాయలసీమలోని అన్ని జిల్లాల్లో రుతుపవనాలు విస్తరించి వర్షాలు కురుస్తాయని జేడీ వరలక్ష్మి తెలిపారు. బంగాళాఖాతంలో రుతుపవనాలు వేగంగా వ్యాపిస్తున్నాయని, ఎల్నీనో బలహీనమై లానినో పరిస్థితులు వచ్చే అవకాశం ఉండటం వల్ల వర్షాలు విస్తారంగా కురుస్తాయని ఆమె స్పష్టం చేశారు. భూమధ్య రేఖ వద్ద పసిఫిక్ సముద్రం చల్లబడటంతో వర్షాలు కురవడానికి అనుకూల వాతావరణం ఏర్పడిందని, ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెప్పినట్లు జేడీ వరలక్ష్మి అన్నారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో అధికవర్షపాతం కురిసేందుకు అవకాశం ఉందని వారు అంచనా వేసినట్లు స్పష్టం చేశారు. మరోవైపు బంగాళాఖాతంలో మే 22న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీని వల్ల మే 24న అల్పపీడనం వాయుగుండంగా మారి వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు సోమవారం ప్రకటించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 6.20 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యే అవకాశం ఉందని అధిక దిగుబడి ముందస్తు వర్షాల వల్ల సాధ్యమవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. నైరుతి రుతుపవనాల వల్ల జూన్ 77.7ఎంఎం, జూలైలో 90.7, ఆగస్టులో 116.2, సెప్టెంబరులో 116.5 ఎంఎం మొత్తం 406.1 ఎంఎం వర్షం కురిసే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి.

గాలివాన బీభత్సం

- పిడుగుపాటుకు 12 పొట్టేళ్లు మృతి
- నేల కూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- బి.నాగిరెడ్డి పల్లెలో మిద్దె చుంచుపై పడిన పిడుగు



రుద్రవరంలో వాలిన విద్యుత్ స్తంభం



రుద్రవరం మండలం నాగులవరం వద్ద రోడ్డుకుఅడ్డంగా పడిన చెట్టు



రుద్రవరంలో ఆటోపై పడ్డ వేప చెట్టు

రుద్రవరం, మే 20: రుద్రవరం మండలంలో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. వారపు సంతలో గుడారాలు చెల్లా చెదరయ్యాయి. భయంకరమైన ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. విద్యుత్‌స్తంభాలు విరిగి నేలపడ్డాయి. ఆటోలపై చెట్లు పడ్డాయి. తువ్వపల్లెలో చింతచెట్టు నేలవాలాయి. నాగుల వరంలో చెట్టుకొమ్మలు విరిగి ఆర్అండ్‌బి రహదరారికి అడ్డంగా విరిగిపడ్డాయి. ఆదివారం రాత్రి ఆర్ కొత్త పెల్ల గ్రామంలో ఖాసీంసాబ్ అనే వ్యక్తికి చెందిన 12 పొట్టేళ్ళు పిడుగు పడడంతో మృత్యువాత పడ్డాయి. దీంతో సుమారు లక్షా యాభైవేల రూపాయల నష్టం వాటిల్లింది. అలాగే బి.నాగిరెడ్డిపల్లెలో మిద్దె చుంచుపై పిడుగు పడింది. రుద్రవరంలో విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



ఆర్ కొత్తపల్లెలో పిడుగుపాటుకు మృతి చెందిన పొట్టేళ్ళు

మూడేళ్లుగా ఏం చేశారు?

- డీసిల్టేషన్ రీచులకు ఈసీ అవసరం లేదంటూ..
- తుంగభద్రను ఇష్టారాజ్యంగా తవ్వేశారు
- సుప్రీంకోర్టు ఆగ్రహంతో క్షేత్రస్థాయికి వెళ్లిన యంత్రాంగం
- ఆ రీచ్‌లకు పర్యావరణ అనుమతులు తప్పనిసరి
- మూడేళ్లుగా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- ఇన్నాళ్లు కళ్లు మూసుకున్నారా..?

ఇసుక అక్రమాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) హెచ్చరించినా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసినా తవ్వకాలు మాత్రం ఆగలేదు. పైగా డీసిల్టేషన్ రీచ్‌లకు పర్యావరణ అనుమతులు అవసరం లేదంటూ మూడేళ్లుగా పెద్దపెద్ద యంత్రాలు, బోట్లు పెట్టి తుంగభద్రను తవ్వేశారు. సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇసుక రీచ్‌ల పరిశీలనకు కదిలిన యంత్రాంగం ఇసుక తవ్వకాలను చూసి నివ్వెరబోయింది. డీసిల్టేషన్ రీచ్‌లకు కూడా పర్యావరణ అనుమతులు తప్పక ఉండాల్సిందే అంటూ తేల్చేశారు. ఏ అనుమతి లేకుండా మరబోట్లతో నదీ గర్భాన్ని తవ్వేస్తుంటే అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కర్నూలు, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుంగభద్ర నది ఇసుక తవ్వకాల కోసం సి. బెళగల్ మండలం కొత్తకోట, కె. సింగవరం, పల్దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె వద్ద నాలుగు డీసిల్టేషన్ రీచులు (నది నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు), కౌతాళం మండలం గుడికంబాలి-1,2,3, మరళి-1,2 కలిపి ఐదు ఓపన్ ఇసుక రీచులు, నందవరం మండలం నాగులదిన్నె వద్ద ఓపన్ ఇసుక రీచులను మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేసి గుర్తించారు. ఈ రీచ్‌లలో ఇసుక తవ్వకాలు, రవాణా కోసం రాష్ట్ర ప్రభుత్వం 2021 మేలో జేపీ పవర్ సంస్థకు రెండేళ్ల లీజు అనుమతులు ఇచ్చింది. ఈ లీజు గడువు 2023 మే 15న ముగిసినా.. ఆ సంస్థ ప్రభుత్వ పెద్దల అండదండలతో యథేచ్ఛగా తవ్వకాలు సాగించింది. ప్రస్తుతం ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థకు లీజు అనుమతులు దక్కించుకొని ఇసుక తవ్వకాలు చేపట్టింది. పర్యావరణ అనుమతులు (ఈసీ) ఇచ్చే వరకు ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) 2023 జూన్ 2న ఆదేశాలు జారీ చేస్తే.. ఈసీతో పాటు భారత ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) నుంచి ఎన్‌వోసీ లేకుండా రీచ్‌లలో ఇసుక తవ్వకాలు చేపట్టరాదని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది తవ్వకాలు ఆగలేదు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు వెళ్లింది. సుప్రీంకోర్టు ఆగ్రహంతో జిల్లా అధికారులు ఇసుక రీచ్‌ల తనిఖీలకు వెళ్లారు. జిల్లా కలెక్టరు డాక్టర్ జి.సృజన నేతృత్వంలో మైనింగ్, ఇగిరేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పర్యావరణ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



సి.బెళగల్ మండలం జి. సింగవరం రీచ్ వద్ద తుంగభద్ర నదిలో బోటింగ్ ద్వారా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు (ఫైల్)

మూడేళ్లుగా ఏం చేశారు?

తుంగభద్రలో ఓపన్ రీచ్‌లకు మాత్రమే పర్యవరణ అనుమతులు అవసరం.. డీసిల్టేషన్ రీచ్‌లు (నది నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు)కు పర్యావరణ అనుమతులు అవసరం లేదంటూ మూడేళ్లుగా యథేచ్ఛగా తవ్వకాలు సాగించారు. సుంకేసుల బ్యారేజీ ఎగువన సి.బెళగల్ మండలం కొత్తకోట, కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె వద్ద తుంగభద్రలో సుమారు 20 బోట్ల ద్వారా డ్రెడ్జింగ్ (బోట్లను నదిలోకి పంపించి) ఇసుక తోడేశారు. ఒక్కో బోటు 20 టన్నుల వరకు ఇసుక ఒడ్డుకు చేరుస్తుంది. ఈ రీచ్‌ల నుంచి రోజుకు వంద టిప్పర్లు, లారీలకు పైగా ఇసుక రవాణా చేసినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. ప్రతి రోజు సగటున 2 వేల టన్నులు ప్రకారం ఏటా సరాసరి 6-7 లక్షల టన్నుల ప్రకారం మూడేళ్లలో 18-20 లక్షల టన్నుల ఇసుక తవ్వేసినట్లు అనధికారిక సమాచారం. ఈ రీచ్‌లకు ఎలాంటి పర్యావరణ అనుమతులు లేవని అధికారులే అంటున్నారు. ఆది, సోమవారాల్లో రెండు రోజులు జిల్లా కలెక్టరు డాక్టర్ జి.సృజన నేతృత్వంలో జిల్లా అధికారుల బృందం కౌతాళం, సి.బెళగల్ మండలాల్లో ఇసుక రీచ్‌లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసిల్టేషన్ రీచ్‌లకు కూడా పర్యావరణ అనుమతులు ఉండాల్సిందే అంటూ సబంధింత శాఖ అధికారులు తేల్చి చెప్పారు. అంటే మూడేళ్ల భారీ యంత్రాలు, భారీ మరబోట్ల సహాయంతో నదిలోని ఇసుకను తోడేశారు. ఈసీ లేకుండా తవ్వకాలు చేస్తుంటే అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారా..? ప్రభుత్వ శాఖ మధ్య సమన్వయలోపం ఇసుక తవ్వకందారులకు వరంగా మారింది. మూడేళ్లుగా ఎలాంటి పర్యావరణ అనుమతులు లేకుండా బోట్లతో తుంగభద్రను తవ్వేసిన నాటి జేపీ పవర్ సంస్థ, ప్రస్తుత లీజుదారుడైన ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు..? అన్నది ప్రశ్నార్థకమే.





గుంతలుగా మారిన తుంగభద్ర నది

ఈఐఏ అనుమతి తప్పనిసరి

మైనింగ్ అధికారులు గుర్తించి ఇసుక రీచ్‌ల్లో లీజు సంస్థ ఇసుక తవ్వకాల కోసం కర్నూలు ప్రాంతీయ వాతావరణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యావరణ అనుమతులు (ఈసీ) ఇస్తారు. ఏటేటా ఈ అనుమతులు రెన్యువల్ చేసుకోవాలి. అందుకోసం ప్రభుత్వం నిర్ధేశించిన రుసుం చెల్లించాల్సి ఉంటుంది. పర్యావరణ అనుమతులు ఇవ్వాలంటే ఎన్విరాన్‌మెంటల్ ఇన్‌పాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఈఐఏ) ఆమోదం తప్పక ఉండాల్సిందేనని పోల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. సి.బెళగల్ మండలం పల్దొడ్డి, కొత్తకోట డీసిల్టేషన్ రీచ్‌లలో ఇసుక తవ్వకాల నిమిత్తం మైనింగ్ అధికారులకు లీజ్ డబ్బులు చెల్లించారు. ఈ తరుణంలో పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టవద్దంటూ అధికారులు తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని మైనింగ్ డీడీ రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లగా డీసిల్టేషన్ రీచ్‌లకు పర్యావరణ అనుమతులు తీసుకోవాలంటున్నారు. ఆ మేరకు ముందుకు వెళ్తామని ఆయన వివరించారు.



ఈర్లదిన్నె రీచ్ వద్ద తుంగభద్రలో ఎక్స్‌కవేటర్ ద్వారా ఇసుకను తోడుతున్న దృశ్యం (ఫైల్)



అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు: కలెక్టర్



ఇసుక రీచులను పరిశీలిస్తున్న కలెక్టర్

సి.బెళగల్, మే 20: అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జి.సృజన అన్నారు. మండలంలోని ఈర్లదిన్నె, శింగవరం, ముడుమాల, పల్దొడ్డి గ్రామాల్లోని ఇసుక రీచులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. మండలంలోని తహసీల్దార్, సీఐ, ఎస్‌ఐ, మైనింగ్ అధికారులు చొరవ తీసుకుని ఇసుక రీచ్‌లు ఉన్న దగ్గర సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నదితీర ప్రాంతాల నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, లారీలను తప్పనిసరిగా పరిశీలించాల్సిన బాధ్యత స్థానిక రెవెన్యూ, పోలీసులదే అన్నారు. అలాగే మండలంలోని పంచాయతీలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని చెప్పారు. కలెక్టర్ వెంట ట్రైనింగ్ కలెక్టర్ కళ్యాణి, ఆర్డీవో శేషిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, మైనింగ్ అధికారులు, తహసీల్దార్ అనుపమ ఉన్నారు.

పెండింగ్ పనుల పూర్తికి చర్యలు: పీఆర్ ఎస్‌ఈ

కర్నూలు(న్యూసిటీ), మే 20: ఎన్నికల కోడ్ అమలుకు ముందు ఆమోదం పొంది.. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పీఆర్ ఎస్‌ఈ కే సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం విశ్వేశ్వరయ్య భవన్‌లోని ఆయన చాంబర్‌లో మాట్లాడుతూ ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద జిల్లాలో 6 పనులు రూ.35.54 కోట్లతో ప్రారంభించామన్నారు. ఇందులో నాలుగు రోడ్లు, రెండు బ్రిడ్జిల నిర్మాణం జరుగుతుందన్నారు. అదేవిధంగా నాబార్డు కింద రూ.183.23 కోట్లతో గ్రామీణ ప్రాంతాలలో 247 కి.మీ. మేర 38 రోడ్ల పనులు ప్రారంభించామని వివరించారు. ఇప్పటి వరకు పారుమంచాల-మిద్దూరు, కేజీ రోడ్డు-వెలుగోడు, డోన్, రాయలచెరువు- పెద్దపాయ, డోన్-గోవర్ధనగిరి, గుడిపాడు- పీఆర్ పల్లె రోడ్లు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.

మందగించిన క్రయ విక్రయాలు

కర్నూలు(అగ్రికల్చర్), మే 20: ఖరీఫ్‌తోపాటు రబీలో నామమాత్రంగా పంట ఉత్పత్తులు రైతుల చేతికి అందడంతో ఆయా మార్కెట్ యార్డుల్లో క్రయ విక్రయాలు అంతంతమాత్రంగా జరుగుతున్నాయి. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డులో వేరుశనగ కాయలు 62 క్వింటాళ్లు, పూల విత్తనాలు ఒక క్వింటం, ఆముదాలు 13 క్వింటాళ్లు రాగా.. వాము పూర్తిగా రాలేదు. మొక్కజొన్నలు 25 క్వింటాళ్లు, కందులు 63 క్వింటాళ్లు, శనగలు 19 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. ప్రతి రోజూ పెద్ద ఎత్తున విక్రయానికి వచ్చే ఉల్లిగడ్డలు పూర్తిగా తగ్గిపోయాయి. సోమవారం కనీసం ఒక క్వింటం కూడా యార్డుకు రాలేదు. ఎండు మిరప కాయలు 104 క్వింటాళ్లు, కొర్రలు 77 క్వింటాళ్లు, మినుములు 9 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. సోయాబీన్ ఒక క్వింటం కూడా విక్రయానికి రాలేదు. కర్నూలు మార్కెట్ యార్డులో విరామం లేకుండా 12 రకాల పంట ఉత్పత్తులను రైతులు విక్రయానికి తీసుకువస్తారు. ఈ సంవత్సరం మాత్రమే పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు పూర్తిగా మందగించాయి. ఆగస్టు నెలలో ఉల్లిగడ్డలు విక్రయానికి వచ్చే అవకాశం ఉందని, అప్పటి దాకా తమకు సెస్సు ఆదాయం కూడా తక్కువగా ఉంటుందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు తెలిపారు.

జంతు సంరక్షణ పర్యవేక్షకుడిగా ఆదోని డీఎస్పీ



కర్నూలు, మే 20: జంతు సంరక్షణకు సంబంధించి ప్రత్యేక పర్యవేక్షకుని అధికారిగా ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జంతు సంక్షేమ బోర్డు జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి జంతువుల అక్రమ రవాణా, జంతువుల వధను నిరోధించడానికి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించారు. జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో హైకోర్టు ఆదేశాలు, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు ఈ నియామకం చేపట్టింది. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఆయా నోడల్ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీజీపీ కార్యాలయం నుంచి ఎస్పీ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయి.

స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రత

ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు

పాణ్యం, మే 20 : మండలంలోని నెరవాడ సమీపంలోని ఆర్జీఎం, శాంతిరాం, ఇంజనీరింగ్ పార్మసీ కళాశాలల్లో భద్రపర్చిన పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంల స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వారు స్ట్రాంగ్ రూంలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కళాశాలల వద్ద కేంద్ర బలగాలు, ఆర్మ్ రిజర్వ్, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూంల తలుపులకు అదనపు భద్రత నిమిత్తం ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్‌ఐ అశోక్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, ఎస్పీ

ఆహారం విషతుల్యం..

● 18 మందికి అస్వస్థత... ● ఇస్వీలో వైద్యబృందం పర్యటన



రోగులను పరామర్శిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని రూరల్, మే 20 : ఆదోని మండలం ఇస్వీ గ్రామంలో ఆహారం విషతుల్యం కావడంతో మూడు కుటుంబాలకు చెందిన 18 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన రోగెమ్మ కొంత కాలంగా హైద్రాబాదులో నివాసం ఉంటోంది. గడిచిన శనివారం దస్తగిరి స్వామి ఉరుసుకు వచ్చిన రోగెమ్మ తన ఇంట్లో గ్యార్మీ నిర్వహించింది. మిగిలిన ఆహారాన్ని ఆదివారం రోగెమ్మ కుటుంబ సభ్యులు తిన్నారు. కొంత పక్కనే ఉన్న మరో రెండు కుటుంబాలకు పంచి పెట్టారు. ఆ ఆహారం తిన్న మూడు కుటుంబాలకు చెందిన 18మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. సోమవారం జిల్లా వైద్య సిబ్బంది చలపతి, వేణుగోపాల్, ఆదోని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ సత్యవతి, డాక్టర్ ఇమ్రాన్, ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ నాగ మల్లయ్య రోగులను పరామర్శించారు. 12మంది డిశ్చార్జి అయ్యారని, మిగిలినవారు చికిత్స పొందుతున్నారని వైద్యులు తెలిపారు.

రాయలసీమలో ఆయుధ ఉత్పత్తి

● బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి



బోర్డు సభ్యులతో డాక్టర్ పార్థసారథి

కర్నూలు, మే 20 (ఆంధ్రజ్యోతి): భారత రక్షణ శాఖకు అవసరమైన ఆయుధాల ఉత్పత్తిలో రాయలసీమ కీలక భూమిక పోషించనుందని ఆదోని టీడీపీ కూటమి బీజేపీ అభ్యర్థి, భారత రక్షణ శాఖకు పరిధిలోని భారత ఎలక్ట్రానిక్ లిమిటెడ్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) డైరెక్టరు డాక్టర్ పార్థసారథి అన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్‌లో జరిగిన భారత ఎలక్ట్రానిక్ లిమిటెడ్ బోర్డు సమావేశానికి ఆయన హాజరయ్యారు. మూడు రోజులపాటు జరిగిన సమావేశంలో దేశంలో భారత రక్షణ శాఖ చేపట్టే ఆయుధ తయారీ, నూతన ఆయుధ కర్మాగారాల ఏర్పాటుపై ప్రధానంగా చర్చించినట్లు ఆయన సోమవారం ఆంధ్రజ్యోతికి వివరించారు. రాబోయే రోజుల్లో రాయలసీమ భారత రక్షణ శాఖ ఆయుధ తయారీలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన రెండు ఆయుధ కర్మాగారాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. మచిలీపట్నంలో ఓ పరిశ్రమ ఇప్పటికే అన్ని దశలు పూర్తి చేసుకుందని, త్వరలో ప్రధాని చేతులు మీదుగా ప్రారంభించాల్సి ఉందన్నారు. అనంతపురం జిల్లాలో కియో కార్ల తయారీ పరిశ్రమకు ఎదురుగా పాలసముద్రం వద్ద డిఫెన్స్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వంలో ఆనాటి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రధాని మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో రక్షణ శాఖ పటిష్టమైన శక్తిగా ఎదిగిందని, ప్రపంచ దేశాలకు ఆయుధాలు ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నామని వివరించారు.

శివాలయంలో చోరీ

ఆత్మకూరు, మే 20: ఆత్మకూరు పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల ఆత్మలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. ఆలయం తలుపులకు ఉన్న తాళాలను ధ్వంసం చేసి ఆలయంలోకి ప్రవేశించి హుండీలో ఉన్న సొత్తును ఎత్తుకెళ్లారని అర్చకుడు మధుసూదన్ శర్మ తెలిపారు. దుండగులు ఆలయంలో ఉన్న బీరువాను పెకిలించి అందులోని వెండి సామగ్రిని చోరీ చేశారు. సోమవారం తెల్లవారుజామున అటుగా వెళ్లిన భక్తులు ఆలయంలో చోరీ జరిగినట్లు గుర్తించి అర్చకుడికి సమాచారం ఇచ్చారు. ఆయన ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. అర్చకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా వుంటే హుండీలో సుమారు 15వేల వరకు భక్తులు వేసిన విరాళాలు పోయి ఉండవచ్చునని ఆలయ నిర్వాహకులు భావిస్తున్నారు.

సప్లిమెంటరీ పరీక్షలపై సమీక్ష

కర్నూలు(కలెక్టరేట్), మే 20: జిల్లాలోని ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు, ఎస్ఎస్‌సీ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారులు కె.మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ, ఎస్ఎస్‌సీ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలో 35 సెంటర్లలో మొదటి సంవత్సరానికి సంబంధించి 15,981 మంది, రెండో సంవత్సరానికి సంబంధించి 22 సెంటర్లలో 6,962 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఆర్ఐవో గురువయ్యశెట్టి, డీవీఈవో సమీర్‌పాషా, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పర్ స్కూల్స్ చంద్రకాంత్, కమిటీ సభ్యులు పరమేశ్వరరెడ్డి, లాలెప్ప, ప్రభు, మున్సిపల్ డీఈ రవికుమార్, పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

ఆళ్లగడ్డ, మే20: మాజీ మంత్రి అఖిలప్రియ బాడీ గార్డ్ నిఖిల్ హత్యాయత్నం కేసులో మరో ముగ్గురిని పోలీసు అధికారులు అరెస్టు చేసినట్లు తెలిసింది. చంద్ర, మాలిక్‌బాషా, నరసింహ అనే నిందితులను హైదరాబాదులో అరెస్టు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ హత్యాయత్నం కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఇందులో ఈనెల 18వ తేదీన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మరో ముగ్గురిని అరెస్టు చేయడంతో మొత్తం ఐదుగురిని అరెస్టు చేసిన ట్లైంది. ఇంకా ఏవీ సుబ్బారెడ్డి, చంటి అనే ఇద్దరు అరెస్టు కావాల్సి ఉంది. ఈ విషయాలను ధృవీకరించేందుకు ఆళ్లగడ్డ పోలీసు అధికారులు అందుబాటులో లేరు.



నల్లకాల్వ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి ప్రత్యేకత

- పాణిపట్టంపై కొలువుతీరిన స్వామిఅమ్మవార్లు
- ఓవైపు విష్ణుస్వరూపం, మరోవైపు శివలింగాకృతిలో పూజలు
- పద్మపురాణంలో ఆలయ చరిత్రపై ప్రస్తావన
- రేపు నల్లకాల్వ లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు


నృసింహస్వామివారి ఆలయ ముఖద్వారం


నల్లకాల్వ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం

ఆత్మకూరు, మే 20: భూప్రపంచంలో విష్ణుస్వరూపమైన నరసింహస్వామికి అనేక చోట్ల ప్రసిద్ధ ఆలయాలు ఉన్నాయి. వీటిలో ఒక్కో ఆలయం ఓ ప్రత్యేకమైన విశిష్టత, చరిత్రను సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామసమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అరుదైన ఇతిహాస నేపథ్యం ఉంది. అయితే లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో మరెక్కడ లేని విధంగా స్వామిఅమ్మవార్లు పాణిపట్టంపై కొలువుతీరి ముందుభాగంలో విష్ణుస్వరూపంగా, వెనకభాగంలో శివలింగాకృతిలో (శివకేశవుల రూపంలో) భక్తులకు దర్శమిస్తూ పూజలందుకుంటున్నారు. ఈ క్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

నల్లకాల్వ నరసింహస్వామి ఆలయంలో మరో ప్రత్యేకత :

ఆత్మకూరు ప్రాంతంలో అత్యంత విశిష్టత కలిగిన నల్లకాల్వ లక్ష్మీనరసింహ క్షేత్రంలో స్వామిఅమ్మవార్ల మూలవిరాట్‌ను ఉత్తరయానంలో సూర్యకిరణాలు స్పర్శిస్తాయి. తూర్పు ద్వారంగా దర్శనభాగ్యం కల్గించే స్వామిఅమ్మవార్లపై ఉత్తరాయణంలోని పుష్యమాసం నుంచి ఆషాడమాసం వరకు ఉదయం 6:30గంటల నుంచి 7 గంటల సమయం మధ్యలో ఈ అపురూపమైన దృశ్యం సాక్ష్యాత్కరిస్తోంది. గర్భాలయం ఎదుట 120అడుగుల దూరం ముఖమంటపం, కల్యాణ మండపం ఉన్నప్పటికీ వాటిని దాటి సూర్యకిరణాలు గర్భాలయంలోని మూలవిరాట్‌పై ప్రసరించడం అద్భుతమని చెబుతారు. ఈ కిరణాలు స్వామిఅమ్మవార్లపై పడటంతో గర్భాలయ గోడలపై మూలవిరాట్ నీడ లింగాకృతిలో ప్రతిబింబిస్తోంది. ఇలాంటి అపురూపమైన దృశ్యాన్ని తిలకించేందుకు ఉత్తరాయణ మాసాల్లో ఉదయాన్నే భక్తులు ఆలయానికి విశేషంగా తరలివస్తారు.


ఉత్తరాయణంలో స్వామిఅమ్మవార్లను తాకిన సూర్యకిరణాలు

రేపు లక్ష్మీనరసింహ స్వామి జయంతి వేడుకలు

నల్లకాల్వ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం స్వామివారి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయ ప్రధానఅర్చకులు ఎస్వీ రమణ నేతృత్వంలో స్వామిఅమ్మవార్లకు పంచసూక్తములతో, పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమార్చనలతో పాటు విశేష అలంకరణ నిర్వహించనున్నారు. అదేవిధంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి అమ్మవార్ల కల్యాణ వేడుకలను శాస్త్రోక్తంగా జరపనున్నారు. అదేవిధంగా ఈ వేడుకకు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు.

నేటి నుంచి గువ్వలకుంట్ల తిరుణాల ప్రారంభం

కొత్తపల్లి, మే 20: కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వెలసిన ఈశ్వరస్వామి తిరునాల మహోత్సవాలు ఈ నెల 21 నుండి 25వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కార్తిక్,పురోహితులు లాల్‌బహదూర్ శాస్త్రిలు తెలిపారు. సోమవారం ఈవో మాట్లాడుతూ ఆలయ ప్రధాన అర్చకులు లాల్ బహదూర్ శాస్త్రి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ సహకారంతో గ్రామస్థుల పర్యవేక్షణలో ఈ నెల 21 న రాత్రి 10 గంటలకు ఈశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం, 22న రాత్రి ప్రభోత్సవం, 23 న మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం రథోత్సవం, 24న సాయంత్రం పారువేట, 25న తీర్థావళితో తిరునాల ఉత్సవాలు ముగుస్తాయని ఈవో చెప్పారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు ఉంటాయని ఈవో వెల్లడించారు.



టీడీపీ జెండా ఎగురవేస్తాం

పాములపాడు, మే 20 : జూన్ 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగుర వేయడం ఖాయమని నందికొట్కూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం మండలంలోని మిట్టకందాల గ్రామంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైందని, భారీ మెజార్టీతో టీడీపీ గెలువబోతుందని అన్నారు. ఎన్నికల్లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో అభివృద్ధి ఏమి జరగలేదన్నారు. 15 రోజుల్లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టనున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరిప్రసాద్, మల్లికార్జున యాదవ్, రఘురామిరెడ్డి, భీమశేఖర్ తదిరులు పాల్గొన్నారు.

350 క్వింటాళ్ల జీలుగలు మంజూరు

మహానంది, మే 20: మహానంది మండలానికి 350 క్వింటాళ్ల జీలుగలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. జూన్ మెదటి వారం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు ప్రణాళికలో భాగంగా వ్యవసాయశాఖ రైతుల అవసరాల కోసం జీలగలు, పిల్లి పెసర కోసం ఉన్నతస్థాయి అధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఇందులో భాగంగా 350 క్వింటాళ్ళు జీలగలు మంజూరయ్యాయని, మిగతా 100 క్వింటాళ్లు కూడా త్వరలో మంజూరు అయ్యే అవకాశం ఉందని ఏవో చెప్పారు. మండలంలోని రైతులు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ కార్డును సిబ్బందికి చూపించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎకరాకు 10 కేజీల ప్రకారం 5 ఎకరాల వరకు 50 కేజీలు జీలుగలు, పిల్లి పెసర అందజేస్తామని తెలిపారు.

ఘనంగా ప్రకాశం పంతులు వర్ధంతి


ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న మాతృభాషా పరిరక్షణ సమితి సభ్యులు

నంద్యాల (కల్చరల్), మే 20: ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం మాతృభాషాపరిరక్షణ సమితి సంస్థ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్, ఉపాధ్యాయ సంఘనేత వీరబ్రహ్మం అతిథులుగా హాజరై ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అన్నెం శ్రీనివాసరెడ్డి, రఫి, శేషఫణి, బాలచంద్రుడు, నీలకంఠమాచారి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో తనిఖీ

పగిడ్యాల, మే 20: పగిడ్యాల గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ప్రకాష్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని పలు రికార్డు, వివిధ రకాల పుస్తకాలను పరిశీలించారు. పగిడ్యాల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం చేయించి పలు రకాల ప్రశ్నలు అడిగారు. కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయ అధికారి మద్దమ్మకు ఆయన సూచించారు.

ఆలయ భూములకు పెరిగిన ఆదాయం

మిడుతూరు, మే20 : మండల పరిధిలోని కడుమూరు గ్రామంలో చెన్నకేశవ, ఆంజనేయ స్వాముల ఆలయ సాగు భూములను కౌలు వేలం పాటలు సోమవారం నిర్వహించినట్లు ఈవో వెంకట రమణ, పర్యవేక్షణ అధికారి బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. 13.50 సెంట్ల ఆలయ సాగు భూములు ఒక ఏడాదికి 11 మంది రూ.2000 చెల్లించి రైతులు వేలం పాటలు పాడగా రూ.2,96000 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.1,10,000 అధికంగా ఆలయ భూములకు ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ హరిప్రసాద్ గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీలి శికారి పేటలో పోలీసుల దాడులు


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నందికొట్కూరు, మే 20: నందికొట్కూరు పట్టణంలోని నీలి శికారి పేటలోని సారాయి బట్టీలపై పట్టణ, రూరల్ సీఐల ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సర్చ్ నిర్వహించారు. పోలీసుల బృందం నీలి శికారి పేటలోని పలు ఇళ్లలో దాడులు చేయగా, బెల్లం ఊటలు, సారాయి లభ్యమయ్యాయని అన్నారు. ఈ దాడుల్లో 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయగా, 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రకాష్ కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్, పట్టణ సీఐ. ప్రకాష్ కుమార్, మిడ్తూరు ఎస్ఐ జగన్మోహన్, పట్టణ పోలీస్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న ఏవో

నంద్యాల టౌన్, మే 20 : నంద్యాలలోని పలు విత్తన విక్రయ దుకాణాలను వ్యవసాయాధికారి ప్రసాదరావు, సిబ్బంది తనిఖీ చేశారు. సోమవారం చేసిన తనిఖీల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, పలు పత్రాలను ఏవో పరిశీలించారు. విత్తన నాణ్యత ప్రమాణాలను తెలుసుకోవడానికి అన్నదాత దుకాణంలో 5 పత్తి విత్తన నమూనాలను, రైతు మిత్ర ఏజెన్సీలో 4 పత్తి విత్తన నమూనాలను తీసుకొని అక్కడే హెచ్‌టీ టెస్ట్ నిర్వహించగా నెగిటీవ్‌గా ఫలితం వచ్చినట్లు ఏవో తెలిపారు. అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని దుకాణాదారులను ఆదేశించారు. అన్ని రకాల ధృవపత్రాలు కలిగి ఉండాలని, ఎంఆర్‌పీ ధరలకంటే అధిక ధరలకు విత్తనాలు విక్రయించరాదని హెచ్చరించారు. విత్తనాలు కొన్న ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలని, లేని పక్షంలో విత్తన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏవో ప్రసాదరావు హెచ్చరించారు.

పోలింగ్ సిబ్బందికి గౌరవ వేతనం చెల్లించాలి

నంద్యాల (కల్చరల్), మే 20: జిల్లాలో ఈనెల 13వతేదీన జరిగిన సాధారణ ఎన్నికల విధులలో పాల్గొన్న పోలింగ్ సిబ్బందికి ఒకరోజు గౌరవవేతనం చెల్లించాలని, హాజరైన వారందరికీ డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలని ఏపీటీఎఫ్ కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు సోమవారం కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు వినతి పత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, అదనపు కార్యదర్శి. పుల్లయ్య, కార్యదర్శి మునిస్వామి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించలేని కింది స్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని కేంద్రాలలో ఓటర్ల సంఖ్య చాలాఎక్కువగా ఉన్నందువలన పోలింగ్ రాత్రి పదిగంటల వరకు జరిగిందన్నారు. కలెక్టర్ స్పందిస్తూ ఒక రోజు గౌరవవేతనంతో పాటు అలవెన్స్‌ను ఎన్నికల కౌటింగ్ తర్వాత చెల్లిస్తామని, నాలుగు రోజుల డ్యూటీ సర్టిఫికెట్ సంబంధిత సిబ్బందికి, సంబంధిత అధికారుల ద్వారా ఇవ్వాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు.


కలెక్టర్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఘనంగా మహానందీశ్వరుడి పల్లకి సేవ


మహానందిలో పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

మహానంది, మే 20: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పరమశివుడు అయిన మహానందీశ్వరునికి పల్లకిసేవను భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో ప్రత్యేక పల్లకిపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులు గావించారు. వేదపండితులు పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు


గువ్వలకుంట్లలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న ఎస్ఐ హరిప్రసాద్, సిబ్బంది

కొత్తపల్లి, మే 20: గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కొత్తపల్లి ఎస్ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ ప్రధాన వీధుల్లో ఎస్ఐ తమ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని, చిన్నపాటి ఘర్షణలు తలెత్తినా ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

గోపవరంలో ర్యాలీ

మహానంది, మే 20: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం మహానంది మండలం గోపవరం గ్రామంలో పోలీస్ అధికారులు ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఇంకా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఓట్ల లెక్కింపు రోజు ఎలాంటి అల్లర్లకు అవకాశం ఇవ్వరాదన్నారు. నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహానంది, బండిఆత్మకూరు గోస్పాడు ఎస్ఐలు నాగేంద్రప్రసాద్, మల్లికార్జున, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.


గోపవరం ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శివకుమార్‌రెడ్డి

వైభవంగా వెండి రథోత్సవం


స్వామి, అమవార్లకు పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీశైలం, మే 20: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛారణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై అశీనులను జేసి ప్రత్యేక పూజలు, మంగళహారతులు జరిపి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

- శ్రీశైల క్షేత్రంలో సోమవారం త్రయోదశి ఘడియలను పురస్కరించుకొని సాయంప్రదోష కాలంలో ఆలయంలోని మల్లికార్జున స్వామికి అభిముఖంగా కొలువై ఉన్న నందీశ్వరస్వామికి పరోక్ష సేవగా విశేష అభిషేకం, అర్చనలు జరిపించారు. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజ నిర్వహించారు.

ఆకట్టుకున్న నిత్యకళారాధన

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన నిలయ అకాడమీ ఆఫ్ కూచిపూడి బృందంచే సంప్రదాయ నృత్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణేశస్తుతి, మూషికవాహన, సకలదేవతా స్తోత్రం, శివతాండవం, భో శంభో, లింగాష్టకం, శివాష్టకం, ఆనందనర్తనం, ఓం నమఃశివాయ తదితర గీతాలకు రాజేశ్వరి, కావ్య రామరాజు, మల్లిక, రేవతి, తరుణి, మనస్వి, భావన, పవిత్ర, నవ్యశ్రీ తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

అమ్మవారిశాల అర్చకుడి మృతి

నంద్యాల (కల్చరల్), మే 20: నంద్యాల అమ్మవారిశాల పూజారి సృష్టి రాజశేఖర్ శర్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో ప్రవీణ్‌కుమార్ శర్మ ప్రథమనందీశ్వరాలయంలో పూజారిగా విధులు నిర్వహిస్తున్నారు. సృష్టి రాజశేఖర్ శర్మ మృతి పట్ల బ్రాహ్మణ సంఘం, పలువురు పట్టణ పుర ప్రముఖులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.



తాగునీరు వృథా


లీకేజీ అవుతున్న నీరు

నంద్యాల రూరల్, మే 19 : పట్టణంలోని 19వ వార్డులో తాగునీటి పైపులైన్ లీకేజీ వల్ల వృథాగా పోతుంది. మాజీ మున్సిపల్ ఛైర్మన్, ప్రస్తుత 19వ వార్డు కౌన్సిలర్ దేశం సులోచన ఇంటికి సమీపంలోనే పైపులైన్ లీకేజీ అయ్యింది. అయితే అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. మూడు రోజుల నుంచి నీరు వృథాగా పోతుంది. అసలే పట్టణంలో తాగునీటి సమస్య ఉంది. దీనికి తోడు ఉన్న నీరు కూడా వృథాగా పోతే ఎలా అని ప్రజలు ప్రశిస్తున్నారు. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

గడివేముల, మే 20: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఘర్షణలు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పాణ్యం సీఐ నల్లప్ప అన్నారు. మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన దుర్వేసిలో సోమవారం పాణ్యం సీఐ నల్లప్ప, గడివేముల ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామ కూడళ్లలో ప్రజలతో సమావేశమయ్యారు. గ్రామాల్లో ప్రజలను రెచ్చగొడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొత్తూరులో కలెక్టరు సతీమణి పూజలు


కలెక్టరు సతీమణికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

పాణ్యం, మే 20 : మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నంద్యాల కలెక్టరు సతీమణి నళిని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, శ్రీనాగలింగేశ్వర స్వామికి ఆమె అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆమెకు ఆలయ సిబ్బంది శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన


ఆలయ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

పాణ్యం, మే 20 : మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం విజయవాడ దేవాదాయ కమిషనర్ కార్యాలయ సాంకేతిక సిబ్బంది పరిశీలించారు. కామన్ గుడ్ ఫండ్స్ నిధుల కింద మంజూరైన శివాలయాల పునర్నిర్మాణంకు భక్తుల సౌకర్యార్థం, భక్తుల సహకారంతో నిర్మిస్తున్న మహాప్రాకారం, షెడ్లు, క్యూలైన్ నిర్మాణ పనులను హెడ్ ఆఫీస్ సహాయ కమిషనర్ జ్యోతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు గంగయ్య, అసిస్టెంటు ఇంజనీరు ఉమాచౌదరి, డ్రాఫ్ట్స్‌మెన్ రవి, కర్నూలు సూపరింటెండెంట్ ఇంజనీరు సతీష్‌లు పనులను పరిశీలించారు. ఆలయ ఈఓ రామకృష్ణ అధికారులచే ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

23 నుంచి రోఖియాబి ఉరుసు

వెలుగోడు, మే 20: ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరిగే ముఖ్యమైన ఉరుసులలో వెలుగోడు రోఖియబి దర్గా ఉరుసు ఒకటి. ఈ ఉర్సును 23న గంధం, 24న ఉరుసు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉరుసుకు జిల్లా నలు మూలల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఈ ఏడాది రోఖియాబి దర్గాను పునః నిర్మాణం చేపట్టారు. ఫిబ్రవరి లేదా మార్చిలో నిర్వహించే ఈ ఉరుసును ఈ ఏడాది మే నెలలో నిర్వహిస్తున్నారు.



డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

యాగంటిలో పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, మే 20: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఈవో చంద్ర శేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితోపాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి ఊరేగించారు.

జ్వాలా నరసింహ స్వామికి పూజలు



జ్వాలా నరసింహ స్వామికి గ్రామోత్సవం చేస్తున్న వేదపండితులు

నంద్యాల మే 20(ఆంధ్రజ్యోతి): ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామికి వేదపండితులు పూజలు చేశారు. సోమవారం కాళీంగన ర్తనోత్సవం అలంకారంలో గ్రామోత్సవం నిర్వహించారు. వైశాఖ మాస నృసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలు వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా జరుగుతున్నాయి.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్యాపిలి, మే 20: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో సోమవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పారాయణాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్యాపిలి, డోన్ మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లలిత పారాయణం

చాగలమర్రి, మే 20: చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అపర ఏకాదశి సందర్భంగా ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానమ్మ ఆధ్వర్యంలో మహిళలు సామూహికంగా లలిత పారాయణం భక్తిశ్రద్ధలతో చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నేలబిలం మల్లేశ్వర స్వామికి విశేష పూజలు

కొలిమిగుండ్ల రూరల్, మే 20: మండలంలోని నేలబిలం మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. వైశాఖ ద్వాదశి, చిత్త నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకుడు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. బందార్లపల్లె గ్రామస్థులతోపాటు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు చెం దిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

పాతబుగ్గ రామలింగేశ్వరుడికి..

డోన్(రూరల్), మే 20: పట్టణ సమీపంలోని పాతబుగ్గ రామలింగేశ్వర స్వామికి సోమవారం భక్తులు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త భైసాని రాజు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

బేతంచెర్ల, మే 20: పట్టణ శివారులోని అన్నపూర్ణ చిన్న పిల్లల అనాథా శ్రమంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం బేతంచెర్ల జూనియర్ ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగింది. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, చిన్నారులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బేతంచెర్ల మండల ఎన్టీఆర్, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు రవికుమార్, ఫ్యాన్స్ కార్యదర్శి నాగేంద్ర, సభ్యులు నాగరాజు, మనోజ్, మహేష్, మాధవ్, అశోక్, అరుణ్, బాలాజి, సురేష్, శ్రీకాంత్, ఆశ్రమ చిన్నారులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

బేతంచెర్ల, మే 20: సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం పురస్కరించుకుని బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పాలును జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ వెల్ఫేర్ బృందం సభ్యులు హుశేన్ ఆర్ఆర్, డీజే మధు మాస్టర్, డీ టైటిల్ విన్నర్ మధుకృష్ణ మాస్టర్, వినోద్ తారక్, జాకీర్, మధు, డీజే మధు, డాష్ స్టూడియో డ్యాన్స్ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్యాపిలి, మే 20: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్రగౌడు సూచించారు. సోమవారం ఆయన ప్రభుత్వ ఆసు పత్రిలో ఆరోగ్య కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ఎటువంటి జాగ్రతలు తీసుకోవాలో ప్రజలకు వివ రించాలన్నారు. వ్యాధులపై నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామ న్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

బనగానపల్లె, మే 20: బనగానపల్లె ఆర్టీసీ పరిధిలోని సమస్యలను పరిష్క రించడానికి ఆర్టీసీ ఆధ్వర్యంలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు రవికిశోర్ సోమవారం తెలిపారు. బనగానపల్లె డిపో పరిధిలో ప్రజారవాణా సమస్యలనపై ఫిర్యాదు చేయాలంటే ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. 9958225892 నెంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను ప్రయాణికులు తెలియజేయాలని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకో వాలని కోరారు.

ఆర్‌బీకే తనిఖీ

చాగలమర్రి, మే 20: చాగలమర్రి గ్రామంలోని మూడవ రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఏవో రంగనేతాజీ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీతో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తామని అన్నారు. 17 ఆర్‌బీకేలలో జీలుగ విత్తనాల కోసం రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని తెలిపారు. 150 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరయ్యాయన్నారు. మార్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు బిల్లులు తప్పని సరిగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, వీపీఏ సుబ్బ రాయుడు ఉన్నారు.

కలగా మారిన 30 పడకల ఆసుపత్రి

- నీటి మూటలవుతున్న పాలకుల హామీలు
- ఇబ్బందులకు గురవుతున్న రోగులు



ప్యాపిలి ప్రభుత్వ ఆసుపత్రి

ప్యాపిలి, మే 20: ప్యాపిలిలో 30 పడకల ఆసుపత్రి ప్రజలకు కలగా మారింది. దశాబ్దాల నుంచి ఆసుపత్రి స్థాయి పెంచుతామని చెబుతున్న పాలకుల హామీలు నీటి మూటలవుతున్నాయి. దీంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందని ద్రాక్షగా మారాయన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణంలో 10 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఉంది. అయితే రోజు రోజుకూ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్న కారణంగా ప్రస్తుతం ఉన్న పడకలు ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా స్థాయిని పెంచుతామన్న పాలకుల హామీలు కార్యరూపం దాల్చడం లేదు. ప్యాపిలిలో 44వ జాతీయ రహదారి ఉన్నందున రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతుంటాయి. ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుంటారు. అయితే ఇక్కడ సరిపడ పడకలు లేదనందున బాధితులకు వైద్యం ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్యాపిలి ఆసుపత్రి స్థాయి పెంచి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా పాండురంగ స్వామి కల్యాణం

కోవెలకుంట్ల, మే 20: పట్టణంలోని పాండురంగస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి, సమేత పాండురంగ విఠలేశ్వరస్వామి కల్యాణం సోమవారం తెల్లవారుఝామున వేదపండితులు వేణుగోపాలాచారి, సుదర్శనాచారి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకిం చారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి పాండురంగస్వామి ఆలయం నుంచి స్వామి వారిని రంగరాజుపేట, సంతపేట, గడ్డవీధి తదితర వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త భూపాల్‌రెడ్డి, కమిటీ సభ్యుడు గడ్డం అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.



కోవెలకుంట్లలో కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



చాగలమర్రిలో..

కమణీయం.. చెన్నకేశవుడి కల్యాణం

చాగలమర్రి: మండలంలోని మల్లేవేముల కుందూ సమీపంలో వెలసిన చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాల బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం చెన్నకేశవస్వామి కల్యాణం కమణీయంగా సాగింది. చెన్నకేశవ, శ్రీదేవి, భూదేవి విగ్రహాలతో వేద పండితులు మాధవాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం చేశారు. పట్టువస్త్రాలు ధరింప చేసి తాళిబొట్టు కట్టించారు. అనంతరం శేషవాహనంలో చెన్నకేశవ, సంజీవరాయస్వామి ఉత్సవమూర్తులచే కొలువుదీరింప చేసి పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఈవో నర్సయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుందూ నదికి జలకళ



మల్లేవేముల సమీపంలో కుందూ నదిలో ప్రవహిస్తున్న వరద నీరు

చాగలమర్రి, మే 20: జిల్లాలోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షంతో కుందూ నదికి జలకళ సంతరించుకుంది. 2 నెలల నుంచి ఒట్టిపోయిన కుందూ వరద నీటితో ప్రవహిస్తోంది. నీరు లేక పోవడంతో మూగ జీవాలు, రైతులు, కూలీలు నీటి కోసం ఇబ్బందులు పడేవారు. వరద నీరు ప్రవహించడంతో ఊరటనిచ్చింది. కుందూ పరిసర గ్రామాల్లోని బోర్లకు కూడా నీటి మట్టం పెరిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బేతంచెర్ల, మే 20: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో 1999-20 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. 24 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు. చదువు చెప్పిన హెచ్‌ఎం ఆదినారాయణ, ఉపాధ్యా యులు వెంకట్రావు, వెంకటరెడ్డి, హనీఫ్‌లను శాలు వతో, పూల మాలతో సత్కరించారు. కార్యక్రమంలో సుమన్, సయ్యద్‌బాషా, బాల వెంకటరమణ, సంజీవ, నాగమధు, వెంకటేశ్వర్లు, సతీష్, సుభద్ర, రాజేశ్వరి, గాయత్రి, చంద్ర కళ, సులోచన, మాధవి పాల్గొన్నారు.

కేడీసీసీ అసిస్టెంట్ మేనేజర్ మృతి

ఉయ్యాలవాడ, మే 20: మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన ఆళ్లగడ్డ కేడీసీసీ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ పసల ఓబులేసు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు, పెద్దయ్మనూరు గ్రామాల పీఏసీఎస్ సీఈవోలు మౌలాలి, రామచంద్రయ్య, సుబ్రహ్మణ్యంతో పాటు వారి సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడికి భార్య ఓబులమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

కొలిమిగుండ్ల రూరల్, మే 20: స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ గోపాల్ సోమవారం తెలిపారు. ఐ మిత్ర కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి, శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి తిరుపతి పుష్పగిరి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కొలిమిగుండ్ల నుంచి ప్రత్యేక బస్సులో రోగులను తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామ న్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

650 క్వింటాళ్ల జీలుగలు మంజూరు

శిరివెళ్ల, మే 20 : మండలానికి 650 క్వింటాళ్ల జీలుగలు మంజూరైనట్లు వ్యవసాయాధికారి సుధాకర్ సోమవారం తెలిపారు. కేజీ జీలుగలు పూర్తి ధర రూ.88 కాగా యాభై శాతం రాయితీ పోగా రైతులు రూ.44లు చెల్లించాలన్నారు. మండలంలోని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులు జీలుగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో సూచించారు.

సారా విక్రేతపై కేసు నమోదు

బేతంచెర్ల, మే 20: మండలంలోని ఎం.పెండేకల్ గ్రామ సమీపంలోని మదర్‌వలి దర్గా వద్ద నాటుసారా విక్రయిస్తున్న వెల్దుర్తి మండలం సిద్దనగట్టు గ్రామానికి చెందిన బోయ రామనాయుడు సారా విక్రేతను సోమవారం అదుపు లోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాసూమ్ తెలిపారు. అతడి వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరు పరిచామన్నారు.

ఇన్‌చార్జి బ్రాంచ్ పోస్టుమాస్టర్ నియామకం

రుద్రవరం, మే 20: రుద్రవరం మండలం శ్రీరంగాపురం గ్రామంలో ఉన్న బ్రాంచ్ పోస్టాఫీసుకు ఇన్‌చార్జి బ్రాంచ్ పోస్టుమాస్టర్ వెంకటేశర్లును నియమించినట్లు అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ సోమవారం తెలిపారు. అక్కడ పనిచేసే శరత్‌నాయక్ విధులకు సరిగా హాజరు కాకపోవడంతో శిరివెళ్ల మండలం మహాదేవపురం గ్రామ బీపీఎం వెంకటేశ్వర్లుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించామన్నారు. ఇక్కడ జరిగిన నిధుల స్వాహాపై రెండో రోజు సోమవారం విచారణ కొనసాగించామన్నారు. మొదటి రోజు విచారణలో 3,48,215 రూపాయలు అవినీతికి పాల్పడినట్లు తేలిందన్నారు. రెండో రోజు విచారణ కొనసాగిందని అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ తెలిపారు.

ఆగిన ఉర్దూ పాఠశాల భవన పనులు

- ఆరేళ్లు గడిచినా పూర్తికాని వైనం
- తాగునీరు, మరుగుదొడ్లు లేక ఇక్కట్లు
- చోద్యం చూస్తున్న అధికారులు



చాగలమర్రిలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

చాగలమర్రి, మే 20: చాగలమర్రిలోని ఉర్దూ పాఠశాలలో కనీస వసతులు లేవు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉండడంతో రెండు ఉర్దూ పాఠశాలలు ఏర్పాటు చేశారు. రెండు పాఠశాలల్లో అదనపు తరగతి గదులు లేవు. ఉర్దూ పాఠశాల స్థాయిని 5 నుంచి 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేశారు. పాఠశాల స్థాయి పెంచిన సమస్యలు పరిష్కరించ లేదు. పాఠశాలలో తాగునీరు, వంటగది, మరుగుదొడ్ల సౌకర్యం లేదు. పాఠశాల భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించిన నేటికీ పనులు పూర్తి కాలేదు. రూ.24 లక్షల మైనార్టీ నిధులతో భవన నిర్మాణ పనులు కాంట్రాక్టర్లు చేపట్టారు. రూ.23 లక్షల వరకు పనులు చేశామని, మరో రూ.5 లక్షలు బిల్లు రావాలని, వైసీపీ ప్రభుత్వం వచ్చాక బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలు ప్రా రంభించే నాటికైన ఉర్దూ పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి చే యాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొలిమిగుండ్లలో పందుల బెడద

- యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్న వైనం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



కొలిమిగుండ్లలో రోడ్డుపై తిరుగుతున్న పందులు

కొలిమిగుండ్ల, మే 20: మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. బనగానపల్లె తాడిపత్రి ప్రధాన రహదారిపై యథేచ్ఛగా పందులు విహరిస్తుండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొలిమిగుండ్లలో పందుల బెడద ఎక్కువైంది. పందులను యజమానులు వాటిని ఊరికి దూరంగా దొడ్లుక ట్టుకొని పెంచాల్సి ఉంది. అయితే పందుల యజమానులు వాటిని ఊరిలోనే వదిలేశారు. పందుల సంఖ్య పెరగడంతోపాటు అవి వీధుల్లో ఇండ్ల వద్దకు వెళ్ళి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మోటార్ సైకిల్, ట్రాక్టర్ ఆటో, లారీ, బస్సుల డ్రైవర్లు వాటిని తప్పించుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాల మీది నుంచి కిందపడి ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. పందులను ఊరికి దూరంగా తరలించాలని ప్రజలు అధికారులకు తెలియజేస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు చేపడుతున్న దాఖలాలు లేవు. అధికారులు చూసీచూడనట్లు ఉన్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఏవో కిశోర్‌కుమార్‌రెడ్డి

నంద్యాల మే 20(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు అమ్మితే విత్తన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏవో కిశోర్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని పలు దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో దుకాణాల్లోని స్టాకు రిజిష్టరు, బిల్లులను పరిశీలించారు. రైతులకు అమ్మిన విత్తనాల బిల్లులను వెంటనే ఇవ్వాలని ఆయన సూచించారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ

వృథాగా పోతున్న తాగునీరు



కొలిమిగుండ్లలో పోస్టాఫీస్ వద్ద లీకేజీ అవుతున్న తాగునీటి పైపులైన్

కొలిమిగుండ్ల, మే 20: అసలే వేసవి కాలం. కొలిమిగుండ్లలో నీటి ఎద్దడి నెలకొని ఉంది. తాగునీటిని పొదుపుగా జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. అటువంటి సమయంలో తాగునీటి పైపులైను నుంచి తాగునీరు లీకేజీ అవుతున్న పరిస్థితి కొలిమిగుండ్లలోని పోస్టాఫీస్ వద్ద నెలకొని ఉంది. శాంతి నగర్‌లోని పోస్టాఫీస్ వీధి, ప్రాథమిక పాఠశాల వీధి ప్రజలకు తాగునీరు అందించే నిమిత్తం చౌకదుకాణం వద్ద ఉన్న బోరుకు మోటర్ అమర్చి తాగునీరు సరఫరా పంచాయతీ వారు చేస్తున్నారు. ప్రస్తుతం పోస్టాఫీస్ వద్ద తాగునీటి పైపులైను లీకేజీ వల్ల తాగునీరు అంతా వృధా అవుతోంది. పైపులైన్లకు మరమ్మ తులు చేయించి తాగునీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కోటకందుకూరులో కార్డన్ సెర్చ్

నంద్యాల మే 20(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు గ్రామంలో రూరల్ సీఐ హనుమంత నాయక్, ఎస్ఐలు సోమవారం సాయంత్రం కార్డన్‌సెర్చ్ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామం సమస్యాత్మకం కావడంతో పోలీసు అధికారులు ప్రత్యేకంగా గ్రామంపై దృష్టి సారించారు. అయితే గ్రామంలో ఎలాంటి మారణాయుధాలు దొరకలేదు. అనంతరం గ్రామంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ నరసింహులు, దొర్నిపాడు ఎస్ఐ సురేష్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశల సేద్యం ఆరంభం



వెంకటాపురంలో పొలాన్ని దుక్కి దున్నించుకుంటున్న రైతు

డోన్(రూరల్), మే 20: డోన్ మండలంలో ఆశల సేద్యం మొదలైంది. గత రెండు రోజుల నుంచి చిన్నపాటి వర్షాలు పడటంతో రైతులు పొలాల వైపు పరుగెడుతున్నారు. డోన్ మండలంలో 25వేల హెక్టార్ల సాగు భూమి ఉంది. వీటిలో జూన్ మొదటి వారంలో మొదలయ్యే ఖరీఫ్ సీజన్‌కు 12వేల హెక్టార్లలో కంది పంట వేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. 2వేల హెక్టార్లలో వేరుశనగ, 3వేల హెక్టార్లలో ఆముదం, మరో 2వేల హెక్టార్లలో కొర్ర, సజ్జ పంటలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్ మొదలు కావడానికి రెండు వారాలుండగా.. అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రైతులు తమ పొలాల్లో ఇప్పుడే దున్ని దున్నుకుంటున్నారు.

దుక్కులు దున్నుకోవడం వల్ల ప్రయోజనాలు
- మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ

రైతులు దుక్కి దున్ని పెట్టుకోవడం మంచిది. దీని వల్ల పొలం లోపలి భాగంలో క్రిమికీటకాలు నశిస్తాయి. పొలం పైభాగం మెత్తగా ఉండి విత్తనాలు వేసు కోవడానికి ఉపయోగకరంగా ఉంటుంది. రైతులు పొలాలను ఖరీఫ్‌కు సిద్ధంగా ఉంచుకోవాలి.

వేలంలో12.50 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

రుద్రవరం, మే 20: మండలంలోని ఆలమూరు గ్రామంలోని చెన్నకేశవ ఈశ్వరస్వామి దేవాలయ ఆలయ భూములకు సోమవారం అబ్జర్వర్ కార్తీక్ ఆధ్వర్యంలో ఈ.ఓ సాయి జయచంద్రారెడ్డి వేలం నిర్వహించారు. చెన్నకేశవస్వామి దేవాలయం సంబంధించిన 115 సర్వే నెంబర్‌లో 7.08 ఎకరాలు 174లో 15.20 ఎకరాలు, 340లో 0.65 ఎకరాలు, ఈశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి 197లో 23.65 ఎకరాలు 576లో 1.53 ఎకరాలకు వేలం నిర్వహించారు. ఆ వేలంలో 12.50 లక్షల ఆదాయం వచ్చింది. గత ఏడాది 9.63 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది అదనంగా 3.13 లక్షల ఆదాయం సమకూరింది. దేవాలయానికి రూ. లక్షల్లో ఆదాయం వున్నా దేవాలయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తంచేవారు.

దేవాలయాల వివరాల కోసం వినతి: ఆలమూరు గ్రామంలోని చెన్నకేశవ, ఈశ్వర దేవాలయాలకు సంబంధించిన వివరాలు తెలియపరచాలని సమాచార చట్టం కింద అదే గ్రామానికి చెందిన పత్తి బ్రహ్మయ్య ఈఓ సాయి జయచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అవుకు, మే 20: అవుకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం మరమ్మతులు చేపట్టనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ పక్కీరయ్య సోమవా రం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మరమ్మతుల్లో భాగంగా అవుకు పట్టణంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.